క్లుప్తంగా

వేణుగోపాలునికి ప్రత్యేక సేవలు



పెడన: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఊంజల సేవ జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి స్వామివారికి ఊంజల సేవ నిర్వహించారు. పండితులు పరాసం కృష్ణప్రసాద్, అగ్నిహోత్రం హరికృష్ణ, కృష్ణామాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బందరుపోర్టు వద్ద సందర్శకుల సందడి



మచిలీపట్నంటౌన్: బందరు సముద్రతీరంలో శరవేగంగా జరుగుతున్న పోర్టు పనులను తిలకించడానికి సందర్శకుల తాకిడి అధికమైంది. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న బందరు ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు పోర్టు పనులు చూడటానికి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పెద్ద ఎత్తున పనులు జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న విమర్శలు విడ్డూరంగా ఉన్నాయని వారు వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయత ఉన్న నాయకుడని ఈ పోర్టు పనులతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చూస్తుంటేనే అర్థమవుతోందని చెబుతున్నారు.

ముగిసిన ఖోఖో పోటీలు



బంటుమిల్లి: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయిలో ఖోఖో పోటీలు రసవత్తరంగా జరిగాయి. బంటుమిల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద తుమ్మిడి జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మంగళవారం మండల స్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించారు. వీటిలో పెద తుమ్మిడి సచివాలయం స్థాయిలోని మహిళలు, పురుషులు జట్లు పెడన నియోజకవర్గ స్థాయిలో ఆడటానికి ఎంపికయ్యాయి.

ముస్లిం మైనార్టీలకు అండగా వైఎస్సార్ సీపీ

పెడన: వైఎస్సార్ సీపీ.. ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచిందని హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ గౌసుల్ ఆజం అన్నారు. పెడనలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ నాడు వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించగా ఇప్పుడు ఆయన తనయుడు నలుగురికి ఎమ్మెల్యేలుగా, నలుగురికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి హోదా కూడా ముస్లింలకు ఇచ్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు నాయుడు కేవలం ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారేగానీ ఎలాంటి పదవులు ఇవ్వలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. ఆయనతోపాటు కృష్ణా జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ స్థానిక నేత నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

బంటుమిల్లి: మండలంలోని ములపర్రు, జానకిరామపురం గ్రామాల్లో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని రెండు రోజులు పాటు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వీటిని సీపీఎం అనుబంధ మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ఆయా గ్రామాలకు చెందిన దాతలు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి బొడ్డు మంగమ్మ, మహిళా సంఘ సభ్యులు ఎం.పద్మ, ఎల్.సుజాత, పి.ధనశ్రీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి వితరణ

అవనిగడ్డ: కోడూరు మండలం హంసలదీవిలోని సియోను ప్రార్థనా మందిరం నిర్మాణం కోసం శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రూ.7వేలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు. చిన్నం దానియేలు, న్యాయవాది దామెర్ల నాగరాజు, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూవో పుట్టి కృష్ణుడు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీదగ్గుమిల్లిలోని రజకుల ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని గంగానమ్మ అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు.
అనంతరం పసుపు కుంకుమలను సమర్పించారు. నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు.

పల్లె వాకిట్లో.. సంక్రాంతి

మచిలీపట్నంటౌన్: గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనల ఆలాపన, గృహాల ముందు రంగవల్లుల అలంకరణ, పిండివంటలు తదితరాలతో నగరవాసులు సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల నడుమ సోమవారం నిర్వహించారు. కనుమ పండుగను మంగళవారం చేసుకున్నారు. పండుగ సందర్భంగా మహిళలు వారి వాకిళ్లలో వేసిన రంగురంగుల ముగ్గులు ఆకర్షించాయి.

రేమాలవారిపాలెం(నాగాయలంక): సంస్కృతి సంప్రదాయాలను నేటి యువకులు సంరక్షించాల్సిన ఆవశ్యకత ఉందని నాగాయలంక ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం చెప్పారు. సాయి బేకరి అధినేత గుడి కోటేశ్వరరావు(కోటి)ఆర్థిక సౌజన్యంతో గ్రామంలోని యూత్ ఆధ్వర్యాన రేమాలవారిపాలెంలో ప్రప్రథమంగా మూడు రోజులు పాటు జరిపిన మా ఊరి సంక్రాంతి వేడుకలు సోమవారం రాత్రి ఉత్సాహంగా ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. సంబరాలు నిర్వహించిన కోటిని అభినందిస్తూ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, పెద్దలు, యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. చోడిశెట్టి మాణిక్యాలరావు, మత్తి రాజారావు, చోడిశెట్టి పెద బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గూడూరు: వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధు గణాలతో మండలంలోని పల్లె వాకిళ్లు సందడిగా మారాయి. గూడూరులో రైల్వేబోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు రంగు రంగుల రంగవల్లులతో ఆకట్టుకున్నారు. విజేతలకు వైఎస్సార్ సీపీ పెడన సమన్వయకర్త ఉప్పాల రాము బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, కృత్తివెన్ను జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గొరిపర్తి వరలక్ష్మి, సర్పంచి లింగం సులోచనారాణి, ఎంపీటీసీ సభ్యులు పిట్ట రామిరెడ్డి, వై.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రంగవల్లులను పరిశీలిస్తున్న ఉప్పాల రాము



నాగాయలంకలో కృష్ణానది ఒడ్డున క్యాంప్‌ఫైర్

పెడన: మన ఊరు.. మన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోటీలు అభినందనీయమని పెడన ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ అన్నారు. గౌడపాలెం జింజేరులో మంగళవారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు, ఆటలు, పాటలు, డ్యాన్స్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథి ఎస్సై రవిచంద్రకుమార్ ప్రసంగించారు.

కోడూరు: కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ నిర్వహించారు. హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కనుమ పురస్కరించుకొని చిన్నారులు గాలిపటాలతో సందడి చేశారు.

శ్రీరామపాదక్షేత్రం ఘాట్ వద్ద..

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ శ్రీరామలింగేశ్వరుని మండపం ప్రాంగణంలో కృష్ణానది ఒడ్డున సోమవారం రాత్రి జరిగిన క్యాంప్ ఫైర్ ఈవెంట్ సందర్శకులను అలరించింది. క్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో అరకు, ఊటీ, హిల్ స్టేషన్స్ లాంటి ప్రాంతాల్లో నిర్వహించే క్యాంప్‌ఫైర్‌ను చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో క్షేత్ర పాలకుడు రఘుశేఖర్ నేతృత్వంలో నిర్వహించారు. నటరాజ్ డ్యాన్స్ అకాడమీ అధినేత, డ్యాన్స్ మాస్టర్ పి.గిరీష్‌కుమార్(గిరి) సారథ్యంలో క్యాంప్ ఫైర్ చుట్టూ ప్రదక్షిణలా రూపొందించిన నృత్యరీతులు ఆకట్టుకున్నాయి. సెమీక్లాసికల్ నృత్య బాలికలు ప్రిహాన్స్, సృజిసాయి, పెప్సీ తదితరులు చక్కటి అభినయ నృత్యాలతో అలరించారు.

నాగాయలంక: నాగాయలంక కృష్ణా నదీ తీరంలో సంక్రాంతి సందడి కనిపించింది. ఘాట్‌లో ఏర్పాటు చేసిన రెక్కల బ్యాక్ డ్రాప్ బోర్డులు ముందు సందర్శకులు పిల్లలు,పెద్దలు ఫొటోలు దిగుతూ బిజీగా గడిపారు.



విజేతలతో ఎస్ఐ రవిచంద్రకుమార్ తదితరులు



కోడూరులో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లి



రేమాలవారిపాలెంలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో గో పూజోత్సవం



గోపూజ చేస్తున్న మహిళలు

గూడూరు: కనుమ పర్వదినం పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన మంగళవారం తరకటూరుపాలెంలో గో పూజోత్సవం నిర్వహించారు. 'మన గుడి'లో భాగంగా కమ్మిల పోతురాజు గోశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి శ్రీమాన్ బృందావనం దాసు ముఖ్యఅతిథిగా పాల్గొని గో-మహాత్మ్యం, గో-పెంపకంతో రైతులకు కలిగే ప్రయోజనాలను భక్తులకు వివరించారు. టీటీడీ హిందూ ధర్మ పరిషత్ ప్రతినిధి తురగా ప్రసాద్, గోశాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

లింగారెడ్డిపల్లిలో..

కోడూరు: పాడిపంటలను అందిస్తున్న గోవులకు రైతులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని లింగారెడ్డిపాలెంలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం మంగళవారం పొలాల్లో గోవుల పండుగను జరిపారు. గ్రామంలోని రామాలయం వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా పొలాల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అన్నదాతలు కట్టెల పొయ్యిపై పొంగలి తయారు చేసి స్వామివారి పూజలు చేశారు. కోడూరు శివరామకృష్ణ క్షేత్రంలో గోవులకు ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మీయ కలయిక



సంగమూడి హైస్కూల్ వద్ద పూర్వ విద్యార్థుల కలయిక

కృత్తివెన్ను: సంగమూడి ఉన్నత పాఠశాలలో 1996–97 టెన్త్‌బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం పాఠశాల వద్ద ఘనంగా జరుపుకున్నారు. నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువులు నరహరిశెట్టి మోహనరావు, శాయన వెంకటసుబ్రహ్మణ్యేశ్వరరావు, వై.అచ్యుతలను ఘనంగా సత్కరించారు.

నాగాయలంక: విద్యాశాఖ ఆదేశాల నేపథ్యంలో సంక్రాంతి పర్వదినాలు పురస్కరించుకుని మంగళవారం నాగాయలంక జెడ్పీ ఉన్నతపాఠశాల ప్లస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంఈఓ రామదాస్ ప్రసంగించారు. రిటైర్డ్ కోఆపరేటివ్ ఉద్యోగి మత్తి నాంచారయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వనమా రామకృష్ణ, మత్స్యకార సంఘాల నేత లకనం నాగాంజనేయులు, పద్యాల రఘురామయ్య, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల 75 సంవత్సరాలు (డైమండ్ జూబ్లీ) పూర్తి అవుతున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన డైమండ్ జూబ్లీ నిర్వహణకు పాఠశాలలో సమావేశం నిర్వహించారు. మొదటి సన్నాహక సమావేశం.. పలువురు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం చర్చించారు. తదుపరి సన్నాహక సమావేశం ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఇదే పాఠశాల ఆవరణలో జరుగుతుందని, పూర్వ విద్యార్థులు తెలిపారు.



నాగాయలంక పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంఈఓ రామదాసు



మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

ద్విచక్ర వాహనచోదకుడికి గాయాలు

బంటుమిల్లి: ఆర్తమూరు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. బంటుమిల్లి వైపు నుంచి ఆర్తమూరు వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు హఠాత్తుగా మలుపు తిప్పడంతో మచిలీపట్నం నుంచి భీమవరం వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఘటనలో ద్విచక్ర వాహనచోదకుడు గాయపడటంతో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వీధి కుక్కల బెడద తొలగించండి

పెడన: వీధి కుక్కల బెడద తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలోని 14, 15వ వార్డు ఉమ్మడి రహదారిలోని సీసీ రోడ్డు వద్ద మిల్లు సమీపంలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, వాహన చోదకులను భయపెడుతున్నాయి. మునిసిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



అందరికీ స్ఫూర్తి



స్ఫూర్తి స్టడీమెటీరియల్‌తో కాలేఖాన్‌పేట మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు (ఫైల్)

- సత్ఫలితాలిస్తున్న టెన్త్ స్టడీమెటీరియల్
- మెరుగైన ఫలితాలకు తోడ్పాటు
- జెడ్పీ ఆధ్వర్యంలో 'పది' విద్యార్థులకు అందజేత

మచిలీపట్నంటౌన్: జిల్లా ఆధ్వర్యంలో మచిలీపట్నం నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు అందజేసిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతోంది. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రత్యేక చొరవతో గత విద్యాసంవత్సరం నుంచి స్ఫూర్తి స్టడీమెటీరియల్‌ను నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నారు. ఇంగ్లిషు, తెలుగు మీడియంలలో మోడల్ పేపర్ల సమాహారంతో ముద్రించిన ఈ పుస్తకం విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు దిక్సూచిగా మారింది. గత ఏడాది స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌లో ఉన్న పలు సబ్జెక్టుల పేపర్లే పబ్లిక్ పరీక్షల్లో వచ్చాయి. దీంతో నియోజకవర్గంలో గత ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈ ఏడాది కూడా నియోజకవర్గంలోని 26 ఉన్నత పాఠశాలల్లో 'పది' 1302 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వీటిని అందజేశారు. నగరంలోని ఏడు మునిసిపల్, నాలుగు ఎయిడెడ్, రెండు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మచిలీపట్నం రూరల్‌లోని పది జెడ్పీ, మూడు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఈ పుస్తకాలను ఇటీవల అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు మేలు



టెన్త్ విద్యార్థులకు మేలు చేయాలనే ఉద్దేశంతో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సూచన మేరకు స్ఫూర్తి స్టడీమెటీరియల్‌ను జిల్లాలో అన్ని పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు అందజేస్తున్నాం. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా నిష్ణాతులతో తయారు చేయించాం.

–వి.జ్యోతిబసు, జెడ్పీ సీఈవో

ఉత్తీర్ణత శాతం పెరిగింది

స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను నాణ్యంగా రూపొందించడంతో గత ఏడాది టెన్త్ ఉత్తీర్ణత శాతం పెరిగింది. స్టడీ మెటీరియల్‌లో ఉన్న మోడల్ పేపర్లు పబ్లిక్ పరీక్షకు ఎక్కువగా వస్తున్నాయి. వీటిని చదివిన విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి వీలు కలుగుతోంది.

–దుర్గాప్రసాద్, ఎంఈవో

మకరజ్యోతి దర్శనం.. పులకించిన భక్తజనం..



రాజకుమారుడిగా అయ్యప్ప మూలవిరాట్



చల్లపల్లిలో అయ్యప్ప నగలు ఊరేగింపు నిర్వహిస్తున్న పాండురంగ గురుస్వామి

కోడూరు : కేరళ తరహా డప్పువాయిద్యాలు.. మేళ తాళాలు.. పూలపరిమళాలు.. బాణసంచా వెలుగుల మధ్య అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనంతో భక్తజనం పులకించారు. అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్ప దేవాలయంలో సోమవారం రాత్రి మకరజ్యోతి దర్శన కార్యక్రమం జరిగింది. ఉదయం అయ్యప్ప మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. సాయంత్రం స్వామివారి నగల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ ఇంటి నుంచి ప్రారంభించారు. స్థానిక శివాలయంలో పూజలనంతరం భావన్నారాయణ నగల పెట్టెతో పదునెట్టంబడిపై నడుచుకుంటూ వెళ్లి మూలవిరాట్‌కు ధరింపజేశారు.

ఆలయంపై జ్యోతి దర్శనం..

ఆలయ ప్రాంగణంలో పెద్దమొత్తంలో కర్పూరం జ్యోతిగా వెలిగించి భక్తులకు దర్శనమందించారు. 19 ఏళ్ల నుంచి ఏటా ఇదే తరహాలో జ్యోతి దర్శనం కల్పిస్తున్నట్లు భావన్నారాయణ చెప్పారు. పంబల రాజుగా, మాలికాపురోత్తమ అమ్మవారి పుట్టింటి వారిగా గ్రామ ప్రముఖులు వ్యవహరించి వివాహ రాయబారోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. హరిహరసుతుడుని రాజకుమారుడిగా అలంకరించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు జరగ్గా, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయంపై వెలుగుతున్న మకరజ్యోతి


మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి జ్యోతి దర్శనం జరిగింది. శబరిమలలో మకరజ్యోతి దర్శనం అనంతరం ఆలయంలో జ్యోతిని వెలిగించగా భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజారులు బంగారు పుష్పాలతో పూజలు చేశారు. ఉదయం సహస్రమోదక శ్రీ లక్ష్మీ గణపతి హోమం, సాయంత్రం ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు.

చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రంలో మకర జ్యోతి దర్శనం వైభవంగా జరిగింది. సాయంత్రం ఆలయ వ్యవస్థాపకుడు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి ఇంటి నుంచి అయ్యప్ప నగల ఊరేగింపు ఘనంగా జరిగింది.

ఆంజనేయుడికి 1008 అరిసెలతో పూజలు

నగరంలోని ఈడేపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి 1008 అరిసెలు సమర్పించి పూజలు చేశారు. స్వామివారిని చెరకు గడలు, తులసి, పూలమాలలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్



ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



మచిలీపట్నంటౌన్: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నగరంలో మంగళవారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక నోబుల్ కళాశాల, ఆంధ్రజాతీయ కళాశాల క్రీడామైదానంలో జరిగిన పోటీల్లో పలు డివిజన్ల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నోబుల్ కళాశాలలో –4, ఆంధ్ర జాతీయ కళాశాలలో –4 జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. నోబుల్ కళాశాల క్రీడామైదానంలో –4 వాలీబాల్, మూడు ఖోఖో, మూడు కబడ్డీ మ్యాచ్‌లు జరిగాయి. ఆంధ్ర జాతీయ కళాశాలలో జరిగిన పోటీలకు 28వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్‌సాహెబ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పణ

మచిలీపట్నంటౌన్: అజ్మీర్ దర్గా వద్ద జరిగే ఉరుసు ఉత్సవాలకు నగరం నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో వీరు సోమవారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) జవ్వారుపేటలోని షా షరీఫ్ ఖలందర్ బాబా దర్గా (టిక్యా)లో చాదర్ సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో అజ్మీర్‌కు వెళ్లే భక్తులకు ప్రత్యేకమైన చాదర్‌ను అజ్మీర్ దర్గాలో ఉంచడానికి అందజేశారు. కార్యక్రమంలో కిట్టుతో పాటు మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు తిరుమలశెట్టి ప్రసాద్, మీర్ అస్గర్‌అలీ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎండీ సదురుద్దీన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ మోహిసిన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



జవ్వారుపేట టెక్యా నుంచి చాదర్ తీసుకువస్తున్న పేర్ని కిట్టు

అనాలోచిత నిర్ణయాలతో సమస్యలు

మచిలీపట్నంటౌన్: అనాలోచిత నిర్ణయాలతో ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడాల్సి వస్తోందని దైవసేవకుడు బ్రదర్ జాన్‌డానియల్ అన్నారు. మల్కాపట్నంలోని ఎల్ఈఎఫ్ చర్చిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీస్తు సువార్త సభలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ఏసు మార్గంలో పయనించాలన్నారు. కాకినాడకు చెందిన దైవసేవకులు బ్రదర్ సత్యం, ఎల్ఈఎఫ్ చర్చి పాస్టర్ తంటెపూడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.